బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ రావు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్లగొండ జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర నాయక్ ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

జగద్గిరిగుట్ట: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్, రాఘవేంద్ర కాలనీలోని ముత్యాలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అభిషేకం, అర్చన, శివ పార్వతుల కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు భరతసింహారెడ్డి పూజలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కుంట సిద్దిరాములు ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన అమ్మవారి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: గాజులరామారం సర్వే నంబర్ 307లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్‌లో రెండు చోట్ల నిర్మాణాలు చేపట్టారని సమాచారం అందడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో గురువారం ఎనిమిది గదులను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సెలవు దినాల్లో సైతం నిర్మాణాలు చేపట్టకుండా నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పంచామృత అభిషేకం



జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్ ఫేజ్ 1 లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా తెల్లవారుజాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మహిళలు విష్ణు పారాయణం చేశారు.

చెత్తను తరలిస్తుండగా విస్ఫోటనం

గాయపడిన కాంట్రాక్ట్ కార్మికురాలు



గాయపడిన లీలమ్మ

రంగారెడ్డినగర్: రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను తరలిస్తుండగా విస్ఫోటనం జరిగి ఓ మహిళా కార్మికురాలు గాయపడింది. ఈ ఘటన కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి రంగారెడ్డినగర్‌లోని సీఐఏ గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గాంధీనగర్ సీఐఏ పరిధిలోని ప్లాట్ నంబరు 113 సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను ఇద్దరు కార్మికులు ట్రాక్టర్‌లో వేస్తున్నారు. ఈ క్రమంలో ఓ సంచిలో ఉన్న చెత్తను తీసే క్రమంలో అది విస్ఫోటనం చెందడంతో జగద్గిరిగుట్టకు చెందిన లీలమ్మకు తీవ్రగాయమైంది. ఆమె పాదం బొటన వేలు ఛిద్రమై రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన లీలమ్మను జగద్గిరిగుట్టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. లీలమ్మ 12 సంవత్సరాలుగా ఐలాలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పని చేస్తోంది. పారిశుద్ధ్య కార్మికులకు బూట్లు, చేతి గ్లౌజులు ఇవ్వకుండానే పనులు చేయిస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

8 మంది బాల కార్మికులకు విముక్తి

జీడిమెట్ల: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం జీడిమెట్ల పీఎస్ పరిధిలో చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎనిమిది మంది చైల్డ్ లేబర్‌ను గుర్తించారు. బాలకార్మికులతో పని చేయిస్తున్న 8 మంది యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపరేషన్‌స్మైల్‌లో ఎస్‌ఐ సుభాష్, ఆపరేషన్స్ స్మైల్ ఇన్‌చార్జి, పోలీసులు పాల్గొన్నారు.



సుభాష్‌నగర్‌లోని నాలాలో వ్యర్థాలు



గంపలబస్తీ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

నాలాల్లోనే వ్యర్థాలు

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ప్లాస్టిక్, వ్యర్థాలతో కూరుకుపోతున్న వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

జీడిమెట్ల: జీడిమెట్ల మొదలుకుని సుభాష్‌నగర్ వరకు ఉన్న నాలాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో నాలాల్లో నుంచి విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించే ప్రజలు దుర్వాసన తాళలేక ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీ మున్సిపల్ అధికారుల అలసత్వంతో నాలాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడూ నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను జీడిమెట్లలో ఐలా మున్సిపల్ సిబ్బంది, సుభాష్‌నగర్ జనావాసా ప్రాంతాల్లో కుత్బుల్లాపూర్ సర్కిల్ సిబ్బంది తొలగించాలి. కానీ ఇక్కడ ఇద్దరు పట్టించుకోకపోవడంతో నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. ముఖ్యంగా సుభాష్‌నగర్, గంపలబస్తీ ప్రాంతాల్లో ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌లలో వెలువడే వ్యర్థాలను నాలాల్లో వేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఫాక్స్‌సాగర్ నుంచి వచ్చే నాలాలో..

భారతి అల్ట్రాఫాస్ట్‌తో వేగంగా నిర్మాణం



గిఫ్టులు అందజేస్తున్న భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్రప్రసాద్

కుత్బుల్లాపూర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్– 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ తెలిపారు. గురువారం సూరారంలోని శ్రీ తిరుమల ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారులకు అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక అని అన్నారు. సమావేశంలో డీలర్ నవీన్, అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ రాజేంద్ర ప్రసాద్, 15 మంది మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బిల్డర్ ఆత్మహత్య



వేణుగోపాల్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: అప్పుల బాధ తాళలేక బిల్డర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి(39) ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పలువురి వద్ద అప్పులు చేశారు. ఇటీవల అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో మానసిక ఆందోళనకు గురైన వేణుగోపాల్‌రెడ్డి ఈ నెల 29న గుండ్లపోచంపల్లిలోని కార్యాలయానికి వెళ్లి ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నానని సూసైడ్ నోట్ రాశారు. అనంతరం ఇంటికి వెళ్లిన అతను సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



డ్రైనేజీ సమస్య తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఆయా డివిజన్‌లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపాలిటీలో ఆయన పర్యటించారు. దుల్లపల్లి రోడ్డు వయా నూజివీడు సీడ్స్ నుంచి కిలోమీటర్ మేర కొంపల్లి శివాలయం, బాబ్రా విల్లాస్, ఆదిత్య రాయల్ పార్క్, అపర్ణ పామ్ గ్రూప్స్, సిల్వర్ లీఫ్ విల్లాస్, గ్రీన్ కౌటి, అపర్ణ ఫేజ్ 3 తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు మూడు సంవత్సరాలుగా దుల్లపల్లి వయా నూజివీడు సీడ్స్ నుంచి కొంపల్లి శివాలయం వరకు రోడ్డు, డ్రైనేజీ పనులు నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు వేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో సమావేశమై అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జెమ్మి దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, గోపాల్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఆంజనేయులు, రామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ దుకాణ సముదాయాల వేలం



వేలంపాటలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని డబుల్ బెడ్ రూమ్ సముదాయంలోని షట్టర్లను అద్దె నిమిత్తం గురువారం వేలం పాట నిర్వహించారు. తహసీల్దార్ మతిన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు ఈఈ రవీందర్, డీఈ నర్సింహులు, ఏఈ వెంకటేశ్వర్ల సమక్షంలో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై వేలం పాటలో పాల్గొన్నారు. షెటర్ల అద్దె కోసం రూ.7 వేల నుంచి రూ.18 వేల వరకు వేలం పాట పాడి సొంతం చేసుకున్నారు. అనంతరం వారికి అధికారులు సంబంధిత పత్రాలను అందజేశారు. మొత్తం 34 దుకాణాలను వేలం పాటలో కేటాయించామని, మిగతా వాటికి డీడీలు అందిన వెంటనే నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, మాజీ కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలి



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో స్టీల్ బ్రిడ్జి పనులు ప్రారంభించాలని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేయడం లేదని ప్రశ్నించారు. సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో 13 ఫీట్ల రోడ్డు బ్రిడ్జి ఉండటం వల్ల 20 సంవత్సరాలుగా విపరీతమైన జనాభా షాపూర్ నగర్ నుంచి సుచిత్ర వెళ్లే వాహనాలతో ఉదయం, సాయంత్రం ప్రజలు నరకం అనుభవిస్తున్నారని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నల్ల జైశంకర్‌గౌడ్, పులి బలరాం, ఋషి పాండే, శ్యామ్ కిరణ్, నరేందర్, చందు, మనీష్, అరుణ్ రావు ఈశ్వర్ రెడ్డి, తిలక్, సరోజ్, పాండు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో చెత్తకు నిప్పు

- పొగతో కాలనీ వాసుల ఉక్కిరిబిక్కిరి
- మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది
- నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తి



మంటలార్పుతున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ స్థలంలో డంప్ చేస్తున్న చెత్తకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని సర్వే నంబర్ 25/1లోని ప్రభుత్వ స్థలాన్ని రాజీవ్ స్వగృహకు అధికారులు కేటాయించారు. గత కొన్నేళ్లుగా సదరు స్థలం ఖాళీగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చెత్తను తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల కాలనీల వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. తరచూ చెత్తకు నిప్పు పెట్టడంతో తమ ఆరోగ్యాలపై పెనుప్రభావం చూపుతోందని, సంబంధిత అధికారులు చెత్తను డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని చుట్టు పక్కల కాలనీల వాసులు కోరుతున్నారు.

బూటకపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 420 బూటకపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటికీ 420 రోజులు పూర్తైన సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం జీడిమెట్ల గ్రామ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభయహస్తం అంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే తెలంగాణ ప్రజల పాలిట బస్మాసుర హస్తంగా కాంగ్రెస్ పాలన తయారైందన్నారు. 'ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవడమేనా? మీరు కోరుకున్న మార్పు. ఇదేనా మీరు చూపిస్తామన్న అసలైన మార్పు' అని ప్రశ్నించారు. గురుకులాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తూ ఉన్నత చదువులు అభ్యసించే విధంగా తమ ప్రభుత్వం పని చేసిందన్నారు. పురుగులన్నంతో 55 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్న ఘనకీర్తి కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2021లో కేసీఆర్ ప్రభుత్వంలోనే ఆన్‌లైన్ విధానం ద్వారా సుమారు 6,47,479 నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశామని గుర్తు చేశారు. హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బీఆర్‌ఎస్వీ ప్రెసిడెంట్ దండుగుల అఖిల్, ఉపాధ్యక్షులు కొర్ర ప్రవీణ్ నాయక్, మహేష్, రతన్, రవి కిరణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ

రోజుల తరబడి చెత్తను తొలగించని సిబ్బంది

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 31వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. రోడ్ల మీదనే చెత్తా చెదారం కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా రాజీవ్ గృహకల్ప సముదాయంతో పాటు సమీపంలోని ఉమామహేశ్వర, నల్లపోచమ్మ ఆలయ కమాన్ వద్ద రోజుల తరబడి చెత్త పేరుకుపోయి ఉండటంతో ఆ మార్గంలో వెళ్లాలంటేనే ఈసడించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. గుడికి వెళ్దామంటే ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్వాసన వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడైతే 25 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటున్నా శానిటేషన్ అధికారులు అటువైపు చూడటం లేదు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం ఫలితం లేకుండాపోయింది. చేసేదేమీలేక ఆలయ కమిటీ ప్రతినిధులే చొరవ తీసుకుని అక్కడ చెత్త వేయరాదంటూ బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది అక్కడే చెత్త వేస్తున్నారు. ఆపై మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది తొలగించకపోవడంతో చిన్నపాటి డంపింగ్ యార్డులా మారిపోయింది. మరోవైపు అపరిశుభ్ర పరిస్థితులతో దోమలు వ్యాప్తి చెందుతుండటంతో ఎక్కడ విష జ్వరాల బారిన పడాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ప్రస్తుతం పాలక మండలి ముగియగా తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రజా ప్రతినిధులు కూడా లేకుండాపోయారని, అధికారులైనా సత్వరమే స్పందిస్తారని అనుకుంటే వారు కూడా కుంటిసాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పేరుకుపోయిన చెత్త



రోడ్డుపై నిల్వ ఉన్న చెత్త

సాయిబాబా ఆలయంలో అన్నదానం



అద్దంకి దయాకర్, కొలన్ హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గురువారం టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సీనియర్ నాయకులు సుధీర్‌రెడ్డి, అరవింద్ నాయుడు, రాములు నాయక్, ఇంద్రజిత్, సల్మాన్ రాజ్, రంగయ్య, మల్లికార్జున్, రవీందర్, తులసి దాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం



మరమ్మతులు చేయిస్తున్న డీజీఎం రవికుమార్, ఏఈ రమ్య భారతి

చింతల్: ప్రతి ఫిర్యాదును స్వీకరించి వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. షాపూర్‌నగర్ సెక్షన్ సంజయ్ గాంధీనగర్‌లో తాగునీటి పైపులైన్‌లో కలుషిత జలాలు సరఫరా కావడంపై జలమండలికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు అందాయి. దీంతో గురువారం షాపూర్‌నగర్ డీజీఎం రవికుమార్ సెక్షన్ మేనేజర్ రమ్య భారతితో కలిసి మరమ్మతులు చేయించారు. కలుషిత జలాలు రాకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.

గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

కుత్బుల్లాపూర్: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేశారని, ఆయన చూపిన అహింసా మార్గంలో నడవాలన్నారు.



ఐడీపీఎల్ చౌరస్తాలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..



జగద్గిరిగుట్టలో .. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్



దూలపల్లిలో పీఏసీఎస్ బ్యాంక్ చైర్మన్ గరిసె నరేందర్‌రాజు తదితరులు



చింతల్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చింతల నాగరాజు